సాక్షి రంగారెడ్డి

శనివారం ♦ 24 ♦ మే ♦ 2025



రక్షణ లేక భక్షణ!

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) భూములకు రక్షణ కొరవడింది. అనేకచోట్ల కబ్జాకు గురవుతున్నాయి. 10లో▸



ఎనిమిది సబ్‌స్టేషన్లు

కల్వకుర్తి నియోజకవర్గానికి నూతనంగా ఎనిమిది సబ్‌స్టేషన్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. 10లో▸



సమన్వయంతోనే..

అగ్ని ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి అన్నారు. 10లో▸

కాన్సులేట్‌కు.. కరెంట్ షాక్!

యూజీ కేబుల్ పనుల్లో భారీ అవినీతి



- కాంట్రాక్టర్‌తో కుమ్మక్కైన ఇంజనీర్లు
- అడ్డగోలుగా అంచనాల పెంపు
- రూ.కోట్లలో స్వాహా చేసిన వైనం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యుత్‌శాఖ అవినీతి హద్దులు దాటింది. ఏకంగా విదేశీ దౌత్య కార్యాలయానికే టోకరా వేసింది. అంచనాలు పెంచడమేగాకుండా.. పనులు చేయకుండానే నిధులు కొల్లగొట్టిన సంఘటన అవాక్కయ్యేలా చేస్తోంది. కాంట్రాక్టు సంస్థ.. ఇంజనీర్లు కుమ్మక్కైఏకంగా రూ.కోట్లను స్వాహా చేసినట్లు తేలడం అధికారుల అవినీతిని తేటతెల్లం చేస్తోంది. నాసిరకం పనులు చేసిన ఏజెన్సీ, పనులను పర్యవేక్షించకుండానే బిల్లులకు తలూపిన ఘటన రంగారెడ్డి జోన్ సైబర్ సిటీ సర్కిల్‌లో జరిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. నానక్‌రాంగూడలోని ఓ కాన్సులేట్ ఆరేళ్ల క్రితం కేటగిరీ–2 కింద కరెంట్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకుంది. డిస్కమ్ ఇంజనీర్లు తొలుత 3,750 కిలోవాట్ల విద్యుత్ లోడ్ ఉన్నట్లు గుర్తించి.. దాన్ని 3,800 కిలోవాట్లకు పెంచుతూ ప్రతిపాదనలు రూపొందించారు. భద్రతాపరంగా కీలకమైన ఈ కార్యాలయ విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఎదురవకుండా.. గచ్చిబౌలి, నానక్‌కరాంగూడ సబ్ స్టేషన్ల నుంచి రెండు ప్రత్యేక భూగర్భ కేబుళ్ల ద్వారా కరెంట్‌ను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే అంచనాల రూపకల్పనలో ఇంజనీర్లు చేతికి పదును పెట్టారు. కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై..అంచనాలను అడ్డగోలుగా పెంచేశారు. దీనికితోడు అప్పటికే ఆ మార్గంలో ఓ ప్రైవేటు సంస్థ తవ్విన స్ట్రెంచ్ నుంచే దౌత్య కార్యాలయానికి కేబుల్ వేశారు. ఈ స్ట్రెంచ్‌ను కూస్తా తామే తవ్వినట్లు రికార్డుల్లో చూపి చేతులు దులుపుకొన్నారు. లేని దూరాన్ని ఉన్నట్లు చూపి వ్యయాన్ని అమాంతం పెంచేశారు. ఇలా ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు రూ.కోట్లు కొల్లగొట్టారు.

అంచనాలు సవరించి..

ఈ రెండు భూగర్భ కేబుళ్ల పనులకు మొదట రూ.11.09 కోట్లు అంచనా వేశారు. తర్వాత 2019లో ఈ అంచనాలను సవరించి రూ.11.35 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. 2020లో భారీగా అంచనాలను సవరించారు. ఏకంగా రూ.3.77 కోట్లకు పెంచుతూ రూ.14.86 కోట్లకు చేర్చారు. యూజీ కేబుల్ సహా ఇతర మెటీరియల్ సరఫరాతో పాటు పనుల పర్యవేక్షణ బాధ్యతను తామే తీసుకోనున్నట్లు డిస్కం ఇంజనీర్లు స్పష్టం చేయడంతో కేబుల్ ఏర్పాటుకు అయ్యే మొత్తం ఖర్చు చెల్లించేందుకు సదరు రాయబార కార్యాలయం అంగీకరించింది.

సెక్యూరిటీ డిపాజిట్ చెల్లింపునకు మెలిక

పనులు చేసిన కాంట్రాక్టర్ సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.31.61 లక్షలు డిస్కమ్‌కు చెల్లించారు. నిజానికి ఈ పనులు మూడేళ్ల క్రితమే ముగిశాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ సెక్యూరిటీ డిపాజిట్ వాపస్ ఇవ్వలేదు. నాసిరకం పనులకు తోడు ప్రతిపాదనలకు భిన్నంగా కేబుల్ పనులు చేయడం, రోడ్డు కటింగ్, తవ్వకాలు, హార్డ్‌రాక్ తొలగింపు వంటి పనులు చేయకుండానే చేసినట్లు చూపి బిల్లులు వసూలు చేయడం వంటి ఆరోపణల నేపథ్యంలో డిపాజిట్ సొమ్మును తిరిగి చెల్లించేందుకు ప్రస్తుత ఇంజనీర్లు జంకుతున్నట్లు తెలిసింది. 'కేబుల్ టెస్టింగ్ వ్యాన్' సాయంతో తనిఖీలు చేస్తే అడుగులోతులో దాగి ఉన్న అనేక అక్రమాలు బయటికి వచ్చే అవకాశం లేకపోలేదు.

లైను తవ్వకుండానే..

మూడుసార్లు అంచనాలు సవరించి పనులను నాటి ఇంజనీర్లు బినామీ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. నానాక్‌రాంగూడ 33/11 కేవీ నుంచి దౌత్య కార్యాలయం వరకు 26 కిలోమీటర్ల యూజీ కేబుల్ వేయాల్సి ఉన్నట్లు పేర్కొన్నారు. తర్వాత రెండు కిలోమీటర్ల దూరాన్ని తగ్గించారు. గచ్చిబౌలి 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి రాయబార కార్యాలయం వరకు 12.09 కి.మీల కేబుల్ వేయాల్సి ఉంది. బీటీ రోడ్డు సహా హార్డ్ రాక్ కటింగ్ కోసం అప్పట్లో డిస్కం నిర్ణయించిన ధరలకు మించి చార్జ్ చేశారు. అప్పటికే ఓ ప్రైవేటు డేటా సెంటర్ విద్యుత్ కనెక్షన్ కోసం డిస్కంకు దరఖాస్తు చేయడం, యూజీ కేబుల్ ఏర్పాటు కోసం అదే మార్గంలో స్ట్రెంచ్‌ని తవ్వి సిద్ధంగా ఉంచడం రాయబార కార్యాలయం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు కలిసి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేటు సంస్థ తవ్విన స్ట్రెంచ్(లైను) నుంచే సదరు కార్యాలయం వరకు కేబుల్ వేశారు. దూరం తగ్గడంతో అంచనాలు తగ్గించాల్సి ఉండగా మరింత పెంచేశారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి తవ్వకాలు జరపకుండానే 3.5 కిలోమీటర్ల బీటీ రోడ్డును కట్ చేయడంతోపాటు 1.2 కిలోమీటర్ల హార్డ్ రాక్‌ను తొలగించినట్లు, కేబుల్ దెబ్బతినకుండా ఉండేందుకు 1,200 మీటర్ల పొడవునా ఖరీదైన జీఐ పైపులను వాడినట్లు, 21 జాయింట్లకు..42 చోట్ల జాయింట్ వర్కులు చేసినట్లు లెక్కలు చూపారు. ఆ మేరకు మళ్లీ అంచనాలు పెంచేశారు. రూ.ఐదారు కోట్లకు మించి ఖర్చుకాని పనులకు రూ.13.38 కోట్లకుపైగా ఖర్చు చేశారు.

వడివడిగా 'ఫ్యూచర్' వైపు

- ఇక ఫ్యూచర్ సిటీలో లేఔట్లు
- వాణిజ్య క్రయవిక్రయాలకు అనుమతులు మంజూరు
- జూన్ నుంచి ఎఫ్‌సీడీఏ కార్యకలాపాలు ప్రారంభం
- కమిషనర్‌కు హెచ్‌ఎండీఏ నుంచి అధికారాల బదిలీ
- పరిశ్రమలకు భూ కేటాయింపుల బాధ్యత ఎఫ్‌సీడీఏదే..



స్వరూపమిదీ..

విస్తీర్ణం:	765.28 చ.మీ
ఎకరాలు:	2,01,318
జనాభా:	1,31,733

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఫోర్త్ సిటీ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) శరవేగంగా అడుగులు వేస్తోంది. జూన్ నుంచి తన కార్యకలాపాలు ప్రారంభించనుంది. ఫ్యూచర్ సిటీలో ఓపెన్ ప్లాట్ లేఔట్లు, నివాస, వాణిజ్య భవన నిర్మాణాల అనుమతులతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు ఎఫ్‌సీడీఏ అనుమతులు మంజూరు చేయనుంది. వీటితో పాటు పరిశ్రమలు, ఐటీ, ఆరోగ్య సంరక్షణ ప్రాజెక్ట్‌లకు భూ కేటాయింపుల బాధ్యత సైతం నిర్వహించనుంది.

హెచ్‌ఎండీఏ నుంచి ఎఫ్‌సీడీఏకు..

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో రాష్ట్రంలో ఫోర్త్ సిటీ అభివృద్ధి అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో జిల్లాలోని ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, కడ్తాల్, కందుకూరు, మహేశ్వరం, యాచారం, మంచాల తదితర ఏడు మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాలను ఎఫ్‌సీడీఏ పరిధిలోకి తీసుకొచ్చారు. కొత్త అనుమతులు, ఆమోదాలను నిలిపివేయడం, మార్గదర్శకాలపై స్పష్టత లేకపోవడంతో రియల్ ఎస్టేట్ డెవలపర్లు, భూ యజమానుల్లో అనిశ్చితి ఏర్పడింది. అథారిటీ ఏర్పాటు వేగంగా జరిగినా.. రెండు నెలల పాటు కార్యకలాపాల నిర్వహణ జరగలేదు. దీంతో ఆయా ప్రాంతాలలో స్థిరాస్తి ప్రాజెక్టులు, అభివృద్ధి పనుల్లో జాప్యం ఏర్పడింది. మార్చి వరకూ ఫ్యూచర్ సిటీ ప్రాంతాల్లో భవనాలు, లేఔట్ల అనుమతులను హైదరాబాద్ మెట్రోపాలిటన్ అభివృద్ధి అథారిటీ (హెచ్‌ఎండీఏ), స్థానిక సంస్థలు మంజూరు చేశాయి. తాజాగా ప్రభుత్వం అధికారాన్ని కార్యాచరణలోకి తీసుకురావడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఎఫ్‌సీడీఏ పరిధిలో లేఔట్లు, నిర్మాణ అనుమతుల అధికారాలను హెచ్‌ఎండీఏ నుంచి ఎఫ్‌సీడీఏ కమిషనర్‌కు బదిలీ చేసింది. దీంతో శ్రీశైలం హైవే వెంట ఉన్న ఫ్యూచర్ సిటీలో పట్టణ మరియు పారిశ్రామిక విస్తరణతో పాటు ప్రణాళికబద్ధమైన అభివృద్ధికి వీలు కలగనుంది.

పేరు మార్పు యోచన?

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా పోలీసు స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీల పేర్ల తరహాలోనే ఫ్యూచర్ సిటీకి కూడా జాతీయ స్థాయిలో గౌరవం పొందేలా ఫ్యూచర్ సిటీని భారత్ ఫ్యూచర్ సిటీగా పేరు మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే పలు కార్యక్రమాల్లో సీఎం తన ప్రసంగాల్లో దీన్ని భారత్ ఫ్యూచర్ సిటీగా ప్రకటించారు. దీంతో జాతీయ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మారుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

న్యూస్‌రీల్

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

మొయినాబాద్‌రూరల్: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివి ఖాళీగా ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి పేర్కొన్నారు. గురుకులాల పూర్వ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి, సాంఘిక సంక్షేమ గురుకుల బాలురు, బాలిక పాఠశాలల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. గురుకులాల్లో ఇంటర్, డిగ్రీ చదివి నిరుద్యోగులుగా ఉన్నవారికి యూఎస్‌ఎక్స్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆయా రంగాల్లో 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. 18–28 సంవత్సరాలు ఉన్నవారు ఈ నెల 30వ తేదీలోపు తమ బయోడేటాతో 97047 63576 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగుడికి 'పాలమూరు' చేయూత



దుకాణం ఎదుట శ్రీశైలంను సన్మానిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: మండల పరిధిలోని చౌలపల్లిలో వికలాంగుడు శ్రీశైలంకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి చేయూత అందించారు. తన సొంత డబ్బులతో శ్రీశైలంకు కిరాణ షాపును ఏర్పాటు చేయించారు. శుక్రవారం ఆయన గ్రామస్తులతో కలిసి దుకాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పసుల నర్సింహ్మా యాదవ్, కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, తోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగులో సరైన పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్లు

చేవెళ్ల: వ్యవసాయంలో రైతులు సరైన సమయంలో, సరైన పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధిస్తారని వ్యవసాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వి.రమ్య, డాక్టర్ వి. కవితకిరణ్ అన్నారు. మండలంలోని ఆలూరులో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని పంచాయతీ కార్యాలయం ఎదుట నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు సాగు చేసే పంట ఎంపిక నుంచి విత్తనం నాటి వాటిని కాపాడుకునే విధానం, ఉపయోగించాల్సిన ఎరువులు, మందులు, మార్కెటింగ్ సౌకర్యం తదితర అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే పండించిన పంటలకు లాభాలు సాధించుకునే అవకాశం ఉంటుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని సూచించారు. భూసార పరీక్షలు చేయించుకొని భూసారాన్ని పెంచుకొని భూమాతను కాపాడుకోవాలన్నారు. విత్తనం కొనుగోలు రసీదులను పంటలు దిగుబడి వచ్చి మార్కెట్‌లో అమ్మే వరకు జాగ్రత్తగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్, ఏఈఓ మౌనిక, కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

హైడ్రా డీఎస్పీగా శ్రీకాంత్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి (హైడ్రా) మరో డీఎస్పీ వచ్చారు. ఇప్పటికే హైడ్రా ఠాణా ఎస్‌హెచ్‌ఓగా ఉన్న తిరుమలేష్ ఒకరు ఉండగా... అదనంగా మరో డీఎస్పీగా సీహెచ్ శ్రీకాంత్‌ను నియమిస్తూ డీజీపీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో శ్రీకాంత్‌ను మాదాపూర్ ఏసీపీగా నియమించారు. దాన్ని రద్దు చేసిన డీజీపీ హైడ్రాలో పోస్టింగ్ ఇచ్చారు. మరోవైపు చిక్కడపల్లి ఏసీపీగా ఎల్.రమేష్‌కుమార్‌ను కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మెట్రో చార్జీలపై 10 శాతం తగ్గింపు నేటి నుంచి

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో చార్జీల పెంపుపై ప్రయాణికుల్లో వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ పెంచిన చార్జీలపై 10 శాతం తగ్గింపును ప్రకటించింది. ఈ మేరకు శనివారం నుంచి 10 శాతం తగ్గింపు అమల్లోకి రానుంది.

అక్షరాస్యతతోనే మహిళల ఆర్థిక ప్రగతి

రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆకునూరి మురళి, చిత్రంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి తదితరులు

యాచారం: ప్రతి మహిళ సంపూర్ణ అక్షరాస్యత కలిగి ఉండాలి, అక్షరాస్యతతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ అల్దాస్ జానయ్యతో కలిసి క్రైటిస్ టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మహిళ సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తేనే ప్రతి ఇంట్లో పిల్లలు జాగ్రత్తగా చదువుకుంటారని అన్నారు. ఆధునిక యుగంలో చదువు ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. ప్రభుత్వం మహిళల ఆర్థిక ప్రగతికి ఎన్నో రకాల రుణాలు అందిస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. మంచాల మండలం ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని, జూలైలో సీఎం రేవంత్‌రెడ్డి పాఠశాలను సందర్శిస్తారని వెల్లడించారు. సాయంత్రం ఆయన గునుగల్‌లో అమేజాన్ అభివృద్ధి చేసిన ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు.



ఎంపీడీఓలతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

పథకాల్లో పురోగతి సాధించాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్‌యువ వికాసం పథకాల్లో పురోగతి కనిపించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలకు ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీడీఓలతో ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని మండలాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇళ్లు త్వరగా నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్‌యువ వికాసం పథకాలు వర్తించేలా చూడాలన్నారు. జూన్ 2 నాటికి ఈ రెండు పథకాల్లో పురోగతి కనిపించాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. మండలాలు, గ్రామాల వారీగా మంజూరైన ఇళ్లు, లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో చేవెళ్ల, మొయినాబాద్, నవాబ్‌పేట, షాబాద్, శంకర్‌పల్లి ఎంపీడీఓలు హిమబిందు, సంధ్య, అనురాధ, అపర్ణ, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

వాటాల పంపకంతోనే విభేదాలు

- బీఆర్‌ఎస్ హయాంలో ప్రజల సొమ్మును దోచుకున్నారు
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: పదేళ్ల పాలనలో అడ్డగోలుగా దోచుకున్న అవినీతి సొమ్ము వాటాల పంపకంలోనే కేసీఆర్ కుటుంబంలో విభేదాలు తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యానించారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్టలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రజల సొమ్మును అడ్డంగా దోచుకొని దాచుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో ప్రభుత్వం చేసిన అవినీతి, అక్రమ దందాలతో కూడబెట్టిన సొమ్ము పంపకాల్లో తేడాలు వచ్చాయని, పార్టీలో సరైన ప్రాతినిధ్యం లేదని, మరెన్నో సమస్యలను ఎమ్మెల్సీ కవిత లేఖలో ప్రస్తావించడం చూశామన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బీజేపీకి పరోక్షంగా మద్దతు ఇచ్చిందని అన్నారు. రాష్ట్రంలో ఇక బీఆర్‌ఎస్ పార్టీ పనైపోయిందన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతిఒక్కరికీ పక్కా ఇంటిని మంజూరు చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట, మహాల్‌ఎలికట్ట, మొగిలిగిద్ద, ఎల్లంపల్లి గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఎలికట్టలో రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బన్సీలాల్, పీఆర్‌ఈఈ గోపాల్, పంచాయతీ కార్యదర్శి తేజస్విని, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి మావో చర్చ

- ఉలిక్కిపడ్డ కేశంపేట మండలం వేములనర్వ
- గతంలో షాద్‌నగర్‌లోనూ మావోయిస్టుల ఛాయలు
- చర్చనీయాంశంగా ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్ ఘటన
- విజయలక్ష్మి మృతితో సుదీర్ఘ కాలం తర్వాత కలకలం





తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీలో గద్దర్‌తో విజయలక్ష్మి (వృత్తంలో)

షాద్‌నగర్: ఓవైపు కల్వకుర్తి.. మరో వైపు పాలమూరు అటవీ ప్రాంతం.. ఈ క్రమంలో మావోయిస్టుల చర్యలు.. కదలికలు ఒకప్పుడు కలవరం పుట్టించాయి.. రెండు దశాబ్దాలుగా అలాంటి ఆనవాళ్లు ఏవీ ఇక్కడ కనిపించడం లేదు.. తాజాగా మావోయిస్టు విజయలక్ష్మి అలియాస్ భూమిక ఎన్‌కౌంటర్ ఘటన మరోసారి షాద్‌నగర్‌లో కలకలం రేపింది.

గతంలో ఇలా..

షాద్‌నగర్ నియోజకవర్గానికి ఆనుకొని ఉండే కల్వకుర్తి నియోజకర్గం మొదటి నుంచీ మావోయిస్టుల కార్యాకలాపాలకు కేంద్రం. ఈ క్రమంలో చాలా మంది మావోయిస్టులు షాద్‌నగర్‌ను కేంద్రంగా చేసుకొని తమ కార్యాకలాపాలు కొనసాగించే వారని గతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. షాద్‌నగర్‌కు సుమారు వంద కిలోమీటర్ల దూరంలో ఉండే నల్లమల అటవీ ప్రాంతం సైతం మావోయిస్టులకు అడ్డాగా ఉండేది. అక్కడి నుంచి కూడా ఇక్కడికి తల దాచుకునేందుకు వచ్చే వారని ప్రచారంలో ఉంది.

ఎన్‌కౌంటర్‌లో హతం

ఫరూఖ్‌నగర్ మండలం నేరేళ్ల చెరువు గ్రామానికి చెందిన జంగయ్య అలియాస్ దివాకర్ నల్లగొండ దళంలో చేరి జిల్లా కార్యదర్శిగా పని చేశాడు. 15 ఏళ్ల క్రితం నల్లమల అటవీ ప్రాంతంలోని గోకారం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. ఈ ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. 2005లో షాద్‌నగర్ పట్టణానికి చెందిన కానిస్టేబుల్ ప్రకాష్‌ను మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో నక్సలైట్లు కాల్చి చంపారు. పదేళ్ల క్రితం కొందుర్గు మండల పరిధిలోని మహదేవ్‌పూర్, టేకులపల్లి గ్రామాల్లో, షాద్‌నగర్‌లోని మిలీనియం టౌన్‌షిప్‌లో మావోయిస్టు సానుభూతిపరులను, ఆ తర్వాత కొందుర్గు మండలం ఆగిర్యాల గ్రామంలో మావోయిస్టు మద్దతుదారులను పోలీసులు అరెస్టు చేసిన సంఘటనలు ఉన్నాయి. అప్పట్లో వారి నుంచి విప్లవ సాహిత్య పుస్తకాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇలా తరచూ ఏదో ఒక సంఘటనకు షాద్‌నగర్ వేదికగా మారింది. ఇరవై ఏళ్లుగా మావోయిస్టులకు సంబంధించి ఎలాంటి కదలికలు లేవు.

మరోసారి ఉలికిపాటు

మావోయిస్టుగా పేరు మోసిన విజయలక్ష్మి ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా సరిహద్దు అబూజ్‌మడ్ అడవుల్లో గత బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన విషయం తెలిసిందే. కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన ఆమె విద్యార్థి దశలో ఉద్యమాల పట్ల ఆకర్షితురాలైంది. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న క్రమంలో అజ్ఞాతంలోకి వెళ్లి నక్సలిజం వైపు అడుగులు వేసింది. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

వేములనర్వలో విషాదఛాయలు

కేశంపేట: ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో వేములనర్వ కు చెందిన విజయలక్ష్మి (38) మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఉదయం నుంచే గ్రామస్తులు విజయలక్ష్మి తల్లిదండ్రులు సాయిలు గౌడ్, సరస్వతిని పరామర్శించారు. మరోవైపు విజయలక్ష్మి మృతదేహాన్ని గ్రామంలోకి తీసుకువచ్చేందుకు కుటుంబ సభ్యులు ఆసక్తి చూపకపోవడంతో అంత్యక్రియల్లో జాప్యం ఏర్పడింది. మరోవైపు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) విజయలక్ష్మిపై కేసులు నమోదు చేసినట్టు తెలిసింది. 2019, 2021లో కేసులను నమోదు చేయగా కొద్దిరోజుల క్రితం వారెంట్ ఇష్యూ చేసినట్టు సమాచారం. ఇంట్లో నుంచి వెళ్లినప్పటి నుంచి విజయలక్ష్మితో సంబంధాలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి రాతపూర్వకంగా తెలియజేసినట్టు సమాచారం.

విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు సెక్షన్లకు చెందిన అధికారులు, అత్యవసర సేవలకు సంబంధించిన ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ ఫోన్ నంబర్లలో మార్పులు చేసినట్లు డీఈ ఫర్హత్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలకు సంబంధించి ఆయా నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సెక్షన్	ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్	అసిస్టెంట్ ఇంజినీర్
సరూర్‌నగర్	8712472349	8712472338
కొత్తపేట	8712472350	8712472338
రామకృష్ణాపురం	8712472351	8712472339
ఎల్‌బీనగర్	8712472352	8712472341
గ్రీన్‌హిల్స్	7013174759	8712472342
బండ్లగూడ	8712472358	8712472359
హయత్‌నగర్	8712472353	8712472343
ఆటోనగర్	8712472355	8712472340
శాంతినగర్	8712472354	8712472362
పెద్దఅంబర్‌పేట	8712472360	8712472344

289 మంది పోకిరీలకు కౌన్సెలింగ్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో యువతులు, మహిళల్ని వేధిస్తూ ఈ ఏడాది జనవరి–ఏప్రిల్ మధ్య షీ–టీమ్స్‌కు చిక్కిన 289 మంది పోకిరీలకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో స్వచ్ఛంద సంస్థలతో కలిసి డీసీపీ డాక్టర్ ఎస్‌జేపీ లావణ్య ఈ కార్యక్రమం నిర్వహించారు. కౌన్సెలింగ్‌కు హాజరైన వారిలో 271 మంది మేజర్లు, 18 మంది మైనర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ తరహా వేధింపులపై 100కు కాల్ చేసి లేదా 9490616555కు వాట్సాప్ ద్వారా సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

మామిడిచెట్టు పైనుంచి పడి మహిళ మృతి

మొయినాబాద్: ప్రమాదవశాత్తు మామిడిచెట్టు పైనుంచి జారిపడి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని మేడిపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి రణమ్మ(57) రెండేళ్లుగా గ్రామంలోని సుకాస ఫాంహౌస్‌లో పనిచేస్తోంది. శుక్రవారం ఉదయం 8.30 గంటల సమయంలో ఫాంహౌస్‌లో మామిడి పండ్లు కోసేందుకు చెట్టుపైకి ఎక్కి ప్రమాదవశాత్తు జారి కిందపడింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే భాస్కర ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కడుపునొప్పి భరించలేక యువతి బలవన్మరణం

యాచారం: కడుపు నొప్పి భరించలేక ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గునుగల్ గ్రామానికి చెందిన రమేశ్, రేణుక కూతురు జాహ్నవి(21) గురువారం సాయంత్రం తీవ్ర కడుపునొప్పితో బాధపడింది ఇది భరించలేని జాహ్నవి అదే రాత్రి ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రక్షణ లేక భక్షణ!

అన్యాక్రాంతంలో హెచ్‌ఎండీఏ భూములు

- రెండు వేల ఎకరాలకు కొరవడిన భద్రత
- ఆ విభాగాల మధ్య సమన్వయలేమి
- అమలుకు నోచుకోని జియో ఫెన్సింగ్
- కబ్జాదారుల చెరలో విలువైన స్థలాలు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) భూములకు రక్షణ కొరవడింది. వివిధ జిల్లాల్లో హెచ్‌ఎండీఏకు చెందిన భూములు వందల ఎకరాల్లో ఉన్నాయి. కానీ అనేక చోట్ల అన్యాక్రాంతమవుతున్నాయి. కబ్జాదారులు భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. మియాపూర్, జవహర్‌నగర్, శంషాబాద్, తదితర ప్రాంతాల్లో ఇప్పటికే పెద్ద ఎత్తున హెచ్‌ఎండీఏ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. చివరకు పోలీసులు, రెవిన్యూ తదితర విభాగాలకు చెందిన యంత్రాంగాలు రంగంలోకి దిగి కొన్ని చోట్ల భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నప్పటికీ దశాబ్ద కాలంగా పెద్ద సంఖ్యలోనే భూములను కోల్పోయినట్లు సమాచారం.

భద్రతా ఏర్పాట్లు చేయకపోవడంతో..

మియాపూర్‌లోని 100, 101 సర్వే నంబర్లలోని సుమారు 500 ఎకరాల భూములను కాపాడుకొనేందుకు గత ఏడాది పోలీసులు కబ్జాదారుల నుంచి హెచ్‌ఎండీఏకు అప్పగించారు. శంషాబాద్‌లోనూ హెచ్‌ఎండీఏకు ఉన్న సుమారు 200 ఎకరాల భూముల్లో 50 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. వీటిలో ఏకంగా కొన్ని భవనాలను కూడా కట్టించారు. వీటి రక్షణ కోసం హెచ్‌ఎండీఏ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. హైకోర్టు తీర్పుతో భూమిని తిరిగి స్వాధీనం చేసుకొనేందుకు చర్యలు చేపట్టారు. అక్రమంగా నిర్మించిన భవనాలను సైతం తొలగించారు. ఇలా ఎక్కడో ఒక చోట కబ్జాకు గురైనట్లు హెచ్‌ఎండీఏ దృష్టికి వచ్చినప్పుడు మాత్రమే అధికారులు జోక్యం చేసుకొని రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఎలాంటి భద్రత ఏర్పాటు చేయకపోవడంతో హెచ్‌ఎండీఏ పరిధిలోని వివిధ జిల్లాల్లో సుమారు 2,000 ఎకరాల భూములకు రక్షణ లేకుండాపోయింది. కొన్ని చోట్ల సరైన సెక్యూరిటీని కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

కాగితాల్లోనే ప్రతిపాదనలు..

మరోవైపు భూములను కాపాడేందుకు వివిధ విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం కూడా సమస్యగా మారింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టేట్ విభాగాల మధ్య కొంతకాలంగా సమన్వయం లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జవహర్‌నగర్‌లో ఇప్పటికే పెద్ద ఎత్తున ఆక్రమణకు గురి కాగా.. మరో 1,300 ఎకరాల భూములు హెచ్‌ఎండీఏ ఖాతాలోఉన్నాయి. 'హెచ్‌ఎండీఏకు చెందిన భూములు ఎక్కడెక్కడ ఉన్నాయనే సంగతి తెలియదు. పై అధికారుల సూచనల మేరకు సెక్యూరిటీ ఏర్పాటు చేయడం వరకే పరిమితమయ్యాం'అని హెచ్‌ఎండీఏ విజిలెన్స్ విభాగానికి చెందిన అధికారి ఒకరు తెలిపారు.

- కబ్జా కోరల్లో చిక్కుకున్న మియాపూర్ భూములను కాపాడేందుకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ తరహాలో మిగిలిన చోట్ల కూడా ఇలాగే చర్యలు తీసుకోవాలనే ప్రతిపాదన ఉన్నా.. అమలుకు మాత్రం నోచుకోవడంలేదు. ఎస్టేట్ విభాగం నిర్లక్ష్యం కారణంగానే ఫెన్సింగ్ పనులు కొనసాగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. హెచ్‌ఎండీఏ పరిధిలోని విలువైన భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ద్వారా నిఘాను బలోపేతం చేయాలని ప్రతిపాదించినా అన్ని చోట్ల ఈ వ్యవస్థ అందుబాటులోకి రాలేదు. మరోవైపు ప్రత్యక్షంగా భద్రత సదుపాయం కల్పించలేని ప్రాంతాల్లో జియోఫెన్సింగ్ ద్వారా భూముల రక్షణకు చర్యలు తీసుకోవాలని భావించినా ఆ ప్రణాళికలు ఇప్పటికీ ప్రతిపాదన దశలోనే ఉండటం గమనార్హం.

రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో హెచ్‌ఎండీఏ భూములు

ప్రాంతం	ఎకరాలు
జవహర్‌నగర్	1300
కంది	50
ఆరుట్ల	110
శంకరంపేట్	86
మియాపూర్	500
చిట్కుల్	50
ఇంద్రకరణ్	140

ఎమ్మెల్యేను కలిసిన ఏసీపీ



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ నుంచి షాద్‌నగర్ ఏసీపీగా బదిలీపై వచ్చిన లక్ష్మీనారాయణ శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లిన ఆయన వీర్లపల్లి శంకర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

తీర్థయాత్రకు వచ్చిన వ్యక్తి అదృశ్యం



దేముడు(ఫైల్)

మొయినాబాద్: తీర్థయాత్రలు తిరుగుతూ చిలుకూరు బాలాజీ ఆలయానికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం మోజయపేటకు చెందిన ఊరిటి దేముడు(56) నలభై మంది బృందంతో ఈ నెల 14న తీర్థయాత్రలకు బయలుదేరారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో మున్సిపల్ పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయానికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న తరువాత భూమహాలక్ష్మి ట్రస్టుకు వెళ్లి విశ్రాంతి తీసుకున్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో దేముడు అదృశ్యమయ్యాడు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

అనుమానాస్పద స్థితిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి



నాగిరెడ్డి(ఫైల్)

ఇబ్రహీంపట్నం: అనుమానస్పద స్థితిలో ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సీఐ జగదీశ్ తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా గురజాల గ్రామానికి చెందిన నాగిరెడ్డి(32) మంగళ్‌పల్లి పరిధిలోని భారత్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు నెలల నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. అదే కళాశాలలో పనిచేసే శివకృష్ణారెడ్డితో కలిసి సమీపంలోని సుప్రియ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆరురోజుల రూమ్‌మెంట్ శివకృష్ణారెడ్డి తన స్వగ్రామానికి వెళ్లాడు. మద్యానికి బానిసైన నాగిరెడ్డి శనివారం నుంచి గదిలోనే మద్యం సేవిస్తున్నాడు. ప్రమాదవశాత్తు ఆయన తలపై మంచానికి(బెడ్)కు ఉన్న ఐరన్ పైపు తలపై పడటంతో గాయమై తీవ్ర రక్తస్రామైంది. క్షతగాత్రుడు మత్తులోనే మృతి చెందినట్లు భావిస్తున్నారు. శుక్రవారం ఉదయం హాస్టల్ గదికి వచ్చిన శివష్ణారెడ్డి విషయం గమనించి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి సమాచారాన్ని ఇచ్చాడు. మృతుడి బావమరిది వెంకటకృష్ణారెడ్డి ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ అనంత లోకాలకు

- ఒకరి మృతి, ఏడుగురికి తీవ్ర గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



ప్రమాదంలో ధ్వంసమైన కారు

బీబీనగర్: దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా కారు అదుపు తప్పి బోల్తాపడడంతో ఒకరు మృతి చెందగా.. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. బీబీనగర్ సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన చేగూరి రామస్వామిగౌడ్(60), లక్ష్మి దంపతులు వారి కోడళ్లు భూమిక, మనీషతోపాటు వీరి పిల్లలు అక్షిత్, అక్షయ్, శ్రీయాంక, సహస్రలతో కలిసి గురువారం సాయంత్రం కారులో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి దర్శనానికి వెళ్లారు. శుక్రవారం ఉదయం దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. బీబీనగర్‌కు రాగానే జాతీయ రహదారిపై ఉన్న ఫ్లైఓవర్ సమీపంలో కారు అదుపు తప్పి సర్వీస్ రోడ్డుపైకి పల్టీ కొట్టింది. దీంతో కారు పూర్తిగా ధ్వంసం కాగా.. వాహనంలోని ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను బయటకు తీశారు. నేషనల్ హైవే అంబులెన్స్‌లో వారిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా రామస్వామి, లక్ష్మితోపాటు, మరొకరి పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రామస్వామి మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆరు కిలోల గంజాయి సీజ్

నిందితుడికి రిమాండ్

చేవెళ్ల: బస్టాండ్‌లో గంజాయి సంచితో అనుమానంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన చేవెళ్ల ఠాణా పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఒడిశాకు చెందిన కరుణాకర్ గౌడ సికింద్రాబాద్ నుంచి మెహదీపట్నం అక్కడ నుంచి చేవెళ్ల బస్‌స్టేషన్‌కు వచ్చాడు. అతడి సంచిలో గంజాయి పెట్టుకుని అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు అతని కదలికలు గమనిస్తూ చేవెళ్ల పోలీసులతో కలిసి వ్యక్తిని పట్టుకుని ఆరుకిలోల గంజాయి ప్యాకెట్లను సీజ్ చేశారు. శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు... నల్గొండ జిల్లా చందంపేటకు చెందిన కృష్ణ(32) గురువారం అర్ధరాత్రి బైక్‌పై యాచారం నుంచి మాల్ వైపు వెళ్తున్నాడు. మార్గ మధ్యలో చింతపట్ల గేట్ వద్ద తుఫాన్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో కృష్ణకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

కల్వకుర్తికి ఎనిమిది సబ్‌స్టేషన్లు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గానికి నూతనంగా ఎనిమిది సబ్‌స్టేషన్లు, 300 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని మానసాగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రైతులు, విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పాడైన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవాటి ఏర్పాటుకు ప్రభుత్వం రూ.2.3 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు.

26న డిప్యూటీ సీఎం రాక

తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ఈ నెల 26న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రానున్నారని చెప్పారు. అనంతరం ఖానాపూర్‌లో బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. భారీ ఎత్తున జనసమీకరణ చేసి సభ విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. సమావేశంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లి రాములు, మాజీ ఎంపీపీ విజయ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల అధ్యక్షుడు జగన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే ప్రమాదాల నియంత్రణ

అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి



సాక్షి,సిటీబ్యూరో: అగ్ని ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో విద్యుత్, టౌన్‌ప్లానింగ్, హైడ్రా, ఫైర్‌సేఫ్టీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుల్జార్‌హౌస్ తదితర అగ్నిప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా విభాగాలు ప్రజలకు తగిన సూచనలివ్వాలన్నారు. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో వ్యాపార సముదాయాల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా నిరోధించే చర్యలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. హెరిటేజ్ భవనాలతో సహా అన్ని భవనాల్లోనూ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఎలాంటి పరికరాలు వాడాలో విద్యుత్ అధికారులు ఎలక్ట్రిక్ పనులు చేసేవారికి, ఎలక్ట్రిక్ షాపులు నిర్వహించే వారికి దశలవారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిస్కమ్ సీఈకి సూచించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, ట్రేడ్‌లైసెన్స్ జారీ చేసే అధికారులు ఫైర్‌సేఫ్టీ మెజర్స్ తప్పనిసరిగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నెలలో ఒకరోజు ఫైర్ సేఫ్టీపై అవగాహనకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ, శిథిలావస్థలో ఉన్న భవనాలను సర్వే చేయనున్నట్లు చెప్పారు. వ్యాపార భవనాల్లో ఫైర్‌సేఫ్టీకి సంబంధించి పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ, ప్రమాదాలు జరిగినప్పుడు ఫైర్, పోలీస్ శాఖలకు మాత్రమే సమాచారం వెళ్తుందని , రెవెన్యూ సంబంధిత శాఖలకు కూడా సమాచారం ఇవ్వాలన్నారు. తద్వారా జిల్లా యంత్రాంగం తరపున అంబులెన్స్, ఆసుపత్రిలో చికిత్స సదుపాయాలు, డాక్టర్లు, బెడ్స్ సిద్ధం చేయడం వంటి చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. 15 మీటర్ల లోపు ఉన్న హాస్పిటల్స్, షాపింగ్ మాల్స్, ఆఫీస్ బిల్డింగ్స్,లాడ్జింగ్, హోటల్, బిజినెస్ మాల్స్, స్టోరేజీ బిల్డింగ్‌లు తప్పని సరిగా ఫైర్ సేఫ్టీ చర్యలు తీసుకోవాలన్నారు. తప్పని సరిగా స్మోక్ డిటెక్టర్ తో పాటు అలారం కూడా ఉండాలని, ప్రజలు కూడా వీటిని గమనించాలన్నారు.

హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు

- నిబంధనల ఉల్లంఘనల గుర్తింపు రూ. 2,45,500 పెనాల్టీ విధింపు
- 30 హాస్టళ్లకు నోటీసులు.. కొన్నింటి మూసివేత



నిర్వహించిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు

సాక్షి,సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలోని పలు హాస్టళ్లపై ఫుడ్‌సేఫ్టీ, టౌన్‌ప్లానింగ్, హెల్త్, తదితర విభాగాల అధికారులతో ఏర్పాటైన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. నగరంలోని పలు హాస్టళ్లు నిబంధనలు ఉల్లంఘించడంతో పాటు కనీస పరిశుభ్రత పాటించకపోవడంతో హాస్టళ్లలో ఉంటున్న వర్కింగ్ మెన్, ఉమెన్, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. పార్కింగ్ సెల్లార్లను ఇతర అవసరాలకు వినియోగించడం, భారీ హోర్డింగులతో వ్యాపారం చేయడం, ఇరుకు గదుల్లో ఎక్కువ మందిని కుక్కడం, తగినన్ని మరుగుదొడ్లు లేకపోవడం, కనీస ఫైర్‌సేఫ్టీ లేకపోవడం, శుభ్రత, నాణ్యత లేని ఆహారం సరఫరా ,ఇతరత్రా లోపాలు కోకొల్లలు. పలు మార్లు హెచ్చరించినా యాజమాన్యాల్లో మార్పు రావడం లేదు.ఈ నేపథ్యంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, అమీర్‌పేట ప్రాంతాల్లోని ని 58 హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకున్నాయి.

- అశోక్‌నగర్ ప్రాంతంలో 20 హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించి ఫుడ్‌లైసెన్సు లేకుండా, అపరిశుభ్రతతో ఆహారం తయారు చేస్తున్న రెండింటిని మూసివేశారు. ట్రేడ్ లైసెన్సులు లేకుండా నిర్వహిస్తున్న ఎనిమిదింటికి నోటీసులు జారీ చేశారు. 9 హాస్టళ్లకు రూ.37,500 పెనాల్టీ విధించారు.
- దిల్‌సుఖ్ నగర్‌లో 23 హాస్టళ్లను తనిఖీ చేసి ఫుడ్ సేఫ్టీ లైసెన్సులేని రెండింటిని మూసివేశారు. ఏడింటికి నోటీసులు జారీ చేశారు. ట్రేడ్‌లైసెన్సులు లేని 11 హాస్టళ్లకు రూ.23వేల పెనాల్టీ విధించారు.
- అమీర్‌పేటలో 15 హాస్టళ్లను తనిఖీ చేసి దేనికీ ట్రేడ్ లైసెన్సు లేకపోవడాన్ని గుర్తించి నోటీసులు జారీ చేయడంతో పాటు రూ.1.85 లక్షల పెనాల్టీ విధించారు. ఫుడ్‌సేఫ్టీ లైసెన్సు లేని ఒక కిచెన్‌ను మూసివేశారు.